క్లుప్తంగా

8 నుంచి మహాభారత యజ్ఞం

తవణంపల్లె: మండల కేంద్రమైన తవణంపల్లెలో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజుల గుడిలో ఈ నెల 8వ తేదీ నుంచి మహాభారత యజ్ఞం కార్యక్రమం జరుగుతుందని ఆలయ ధర్మకర్త గుడిసె మునస్వామి శెట్టి, కార్యనిర్వాహకులు తెలిపారు. 8వ తేదీన ఆదివారం ఉదయం 9 గంటలకు భక్తితో ధ్వజారోహణం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తామన్నారు. భాగవతారిణి స్వర్ణలతచే ఈ నెల 8 నుంచి 30వ తేదీ వరకు హరికథా గానం ఉంటుందన్నారు. 16వ తేదీ బకాసుర బలిబండి కార్యక్రమం, అదే రోజు రాత్రి నుంచి ముత్తుకూరు అమ్మన్ నాట్యకళామండలిచే తమిళంలో రాత్రి నాటకం జరుగుతుందని వివరించారు.

పేదలకు వరం ఫ్యామిలీ డాక్టర్

తవణంపల్లె: పేదలకు ఇంటింటికి తిరిగి వైద్య సేవలు అందిస్తున్నామని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. సోమవారం మండలంలోని ద్వారాకాపురంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ద్వారాకాపురంలో డాక్టర్ రోగులకు వైద్య పరీక్షలు చేయించారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, మహిళలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్థులకు ప్రత్యేక పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్య రక్షణ



గర్భిణికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఐరాల: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరి శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీన్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని 35 యర్లంపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 60 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్థులకు పరీక్షలు నిర్వహించారు. నడవలేని పరిస్థితులు ఉన్న రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని మందులు అందజేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ఇంటి వద్దకే వైద్యం

గుడిపాల: రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌తో ప్రజల ఇంటి వద్దకే వైద్యం వస్తోందని బొమ్మసముద్రం వైద్యాధికారి రష్మిత అన్నారు. సోమవారం తిమ్మాపల్లె గ్రామంలో గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం బీపీ, షుగర్ ఉన్న వారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి ఇంటి వద్దనే ఆరోగ్య సేవలను అందించారు. వైద్య సిబ్బంది శ్రీలక్ష్మి, శిల్ప, సరిత, శివగామి, కిరణ్‌కుమారి పాల్గొన్నారు.

పీఐయూ ఈఈగా నాగరాజు

చిత్తూరు కార్పొరేషన్: పంచాయతీరాజ్ పీఐయూ విభాగం ఈఈగా నాగరాజును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏలూరు ఏపీఎంఎస్ఐడీసీ ఈఈగా ఉన్న ఆయన్ను ఇక్కడి బదిలీ చేసింది. సొంత జిల్లా వర్కింగ్ నిబంధనకు రిలాక్స్ ఇస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గతంలో ఆయన పలమనేరు డీఈగా పనిచేశారు.

పండుగ పూట పస్తులా..?

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బందికి కొన్ని నెలలుగా జీతాలు చెల్లించక పోవడం దారుణమని ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగరాజన్ నిరసించారు.. వినాయకచవితి పండుగకు కార్మికులతో పాటు వారి కుటుంబసభ్యులు పస్తులు ఉండాలా? అని ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఏజెన్సీలకు టెండర్ ఇవ్వడం వల్ల ఈ పరిస్థితి తలెత్తుతోందని, ఇలాంటి ఏజెన్సీ టెండర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

బ్రహ్మోత్సవాలకు రండి సార్..!

చిత్తూరు కలెక్టరేట్: శ్రీకాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాలకు విచ్చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీకి పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ ఆహ్వానపత్రికను అందజేశారు. 7 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లపై ఆయనతో కొంతసేపు చర్చించారు.అనంతరం ఎస్పీ మణికంఠ, జేసీ విద్యాధరిలకు కూడా ఆహ్వానపత్రికలను అందజేశారు. కార్యక్రమంలో కాణిపాకం ఆలయ ఈఓ గురుప్రసాద్, ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, వేదపండితులు పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా

పలమనేరు: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 3న రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బాబు సోమవారం తెలిపారు. ఐసీఐసీ బ్యాంకు, ఎస్ఐబీటీ, సుగుణ ఫౌల్ట్రీ, డిక్సన్, ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీల్లో ఉద్యోగాల కోసం అభ్యర్థులను ఎంపిక చేస్తారని తెలిపారు.

పేదల గుండె చప్పుడు వైఎస్సార్

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 15వ వర్ధంతి పురస్కరించుకుని సోమవారం చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల వ్యాప్తంగా మహానేతకు ఘన నివాళులు అర్పించారు. సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్ అమలు చేసిన ఉచిత విద్యుత్, 104, 108, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్..ఇత్యాది పథకాలు దేశానికే ఆదర్శమయ్యాయని ఆయన సేవలను కీర్తించారు.



బంగారుపాళెం: అన్నదానం చేస్తున్న నాయకులు



పూతలపట్టులో..







ఐరాలలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు, గుడిపాల: సింగారిపేటలో.., చిత్తూరు కార్పొరేషన్: నివాళి అర్పించిన విజయానందరెడ్డి, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక డీసీసీ బ్యాంకు ఆవరణలోని వైఎస్సార్ విగ్రహానికి ప్రజల చిత్తూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త విజయానందరెడ్డి, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ పుష్పాంజలి ఘటించారు. భౌతికంగా మన మధ్య లేకపోయినా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని స్మరించారు. ప్రతి ఇంటికీ ఏదో ఒక రూపంలో సంక్షేమ పథకాలు అందించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. రచ్చబండ కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లాకు వస్తూ ప్రమాదానికి గురై తిరిగిరాని లోకాలకు చేరుకున్నారని శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో చుడా మాజీ చైర్మన్ పురుషోత్తంరెడ్డి, మహిళా విభాగం మాజీ అధ్యక్షురాలు గాయత్రీదేవి, నగర పార్టీ అధ్యక్షుడు జ్ఞాన జగదీష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు రాహుల్ రెడ్డి, కృష్ణారెడ్డి, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, నాయకులు, ప్రజాప్రతినిధులు త్యాగ, రాంగణేష్, మధురెడ్డి, సూర్యప్రతాప్, కేపీ శ్రీధర్, భాగ్యలక్ష్మి, హరిణిరెడ్డి, అంజలిరెడ్డి, అను, చల్లాముత్తు, శిరీష్‌రెడ్డి, ప్రకాష్, రజని, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• జెడ్పీ కార్యాలయంలోని వైఎస్సార్ విగ్రహానికి జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎందరో ఉన్నత విద్యను అభ్యసించి పలు రంగాల్లో స్థిరపడటానికి కారణం వైఎస్సార్ అని కొనియాడారు. కార్యక్రమంలో స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ భారతి, జెడ్పీటీసీ బాబునాయుడు తదితరులు పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు భూపేష్ జెడ్పీలోని వైఎస్సార్ విగ్రహానికి నివాళి అర్పించారు.

గుడిపాలలో..

గుడిపాల: మండలంలోని సింగారిపేట, గొల్లమడుగులో వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రకాష్, వరదరాజులురెడ్డి లారెన్స్, రాకేష్, రమేష్, నోబెల్, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

బంగారుపాళెం: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి నిరుపేదల మదిలో కొలువై ఉన్నారని మాజీ ఎమ్మెల్యే లలితకుమారి అన్నారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి 15వ వర్ధంతిని సోమవారం మండలవ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని మొగిలివెంకటగిరిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తులసీరామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో తగ్గువారిపల్లె, కరిడివారిపల్లె, కీరమంద, గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ చిత్రపటానికి నివాళులు అర్పించి అన్నదానం చేశారు. మండల కేంద్రం బంగారుపాళెంలో పార్టీ కన్వీనర్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో దివంగత నేత వైఎస్సార్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా, ఎంపీపీ అమరావతి, జెడ్పీటీసీ సోమశేఖర్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుబ్రమణ్యం, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు శరత్‌రెడ్డి, సర్పంచ్‌లు మాలతి, శ్రీనివాసు లు, ఆశా ఎంపీటీసీలు హరి, హేమచంద్ర, వడ్డెర, ఈడిగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్లు మొగిలీశ్వర, ఎల్లప్ప, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి, నాయకులు కృష్ణమూర్తి, థామస్, గోవిందరాజులు, అరుణామల్ రెడ్డి పాల్గొన్నారు.

యాదమరిలో..

యాదమరి(పూతలపట్టు): మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి సేవలు మరవలేనివని ఎంపీపీ సురేష్ బాబు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం వద్ద వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రవీంద్ర, నాయకులు మనోహర్‌రెడ్డి, చిన్నబరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పూతలపట్టులో..

పూతలపట్టు: మండల కేంద్రంలో దివంగతనేత వైఎస్ రాజశేఖర రెడ్డి చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ నాయకులు తలపులపల్లి బాబురెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి నివాళులు అర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే పార్టీ జిల్లా మహిళా కార్యదర్శి గౌహతి రెడ్డి ఆధ్వర్యంలో, పి.కొత్తకోటలోని వైఎస్సార్ విగ్రహానికి పార్టీ నాయకులు రాజారత్నంరెడ్డి ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దేవిక, సర్పంచుల సంఘ అధ్యక్షుడు జయచంద్రరెడ్డి, సర్పంచ్ మాసిలామణి తదితరులు పాల్గొన్నారు.

ఐరాలలో..

ఐరాల: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా మండల కన్వీనర్ చంద్రశేఖర్ రెడ్డి మండలకేంద్రంలోని వైఎస్సార్ విగ్రహానికి నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ విగ్రహం వద్ద మొక్కలు నాటారు. అదేవిధంగా గోవిందరెడ్డిపల్లె, గుండ్లపల్లెలో స్థానిక సర్పంచులు గుణవతి, రెడ్డెమ్మ, నాయకులు వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మోహన్, వైస్ సర్పంచ్ బద్రీనాథ్, సింగిల్‌విండో చైర్మన్ ధనచంద్రారెడ్డి పార్టీ నేతలు పాల్గొన్నారు.



ఐరాలలో అన్నదానం



గుడిపాల: అన్నదానం చేస్తున్న నాయకులు



జెడ్పీలో నివాళి అర్పిస్తున్న వైస్ చైర్‌పర్సన్ రమ్య



ఐరాల మండలంలో..



పూతలపట్టు: నివాళులు అర్పిస్తున్న గౌహతిరెడ్డి

విద్యార్థులకు నైతిక విలువలు ముఖ్యం

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులకు చదువుతో పాటు నైతిక విలువలు పాటించడం కూడా ముఖ్యమని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జీవనజ్యోతి అన్నారు. సోమవారం కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ, కొత్తగా డిగ్రీలో చేరిన విద్యార్థులు కళాశాల విధి విధానాలు, పాఠ్యాంశాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. లక్ష్యాలను సాకారం చేసుకునే దిశగా శ్రమించాలన్నారు. వ్యక్తిత్వ వికాసం, సామాజిక బాధ్యత పట్ల అవగాహన, సృజనాత్మకతకు ప్రాధాన్యం కల్పించే ఒక చక్కని వేదిక కళాశాల అని అన్నారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మీరాసాహెబ్ మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు గోపినాయక్, శరవణ, జయచంద్రుడు, చంద్రమౌళి, హరిప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయవాడకు బయలుదేరిన ట్రాన్స్‌కో ఉద్యోగులు



విజయవాడకు ఉద్యోగులను పంపుతున్న ఈఈ మునిచంద్ర

చిత్తూరు కార్పొరేషన్: విజయవాడలో వరదల నేపథ్యంలో దెబ్బతిన్న విద్యుత్ పనుల పునరుద్ధరణ నిమిత్తం ట్రాన్స్‌కో సిబ్బంది సోమవారం రాత్రి గాంధీరోడ్డులోని డివిజన్ కార్యాలయం నుంచి విజయవాడకు బయల్దేరి వెళ్లారు. ఏఈ బాలచంద్ర, 13 మంది లైన్‌మెన్లు, జూనియర్ లైన్‌మెన్లు, ఇద్దరు డ్రైవర్లు వెళ్లే వాహనాలను ఈఈ మునిచంద్ర జెండా ఊపి పంపారు. కార్యక్రమంలో డీఈలు పద్మనాభపిళ్లై, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి..!

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని పలు వార్డుల్లో సోమవారం జనసేన, కూటమి నాయకులు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. 47 వ డివిజన్‌లో జనసేన పార్టీ ఇన్‌చార్జి వినోద్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, మేయర్ అముద, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆరణి కవిత, కార్యకర్తలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సకాలంలో పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

చిత్తూరు అర్బన్: 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమంలో అందే వినతులను సకాలంలో పరిష్కరించాలని సహాయ కమిషనర్ ఎ. ప్రసాద్ ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో టిడ్కో -2 మెప్మా -1 చొప్పున మొత్తం మూడు వినతులు అందాయి. కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టర్ అనిల్ కుమార్ నాయక్, ఎంఈ గోమతి, మేనేజర్ గోపాలకృష్ణ వర్మ, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ యోజన సద్వినియోగం చేసుకోండి

• కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ



శిక్షణా కార్యక్రమంలో పనిముట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, ఎమ్మెల్యే

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా ప్రజలు పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలో పీహెచ్‌కాలనీలోని న్యాక్ కార్యాలయంలో పీఎం విశ్వకర్మ యోజన పథకం కింద తాపీ మేస్త్రీ, కార్పెంటర్ వృత్తుల శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో అర్హులైన వారందరూ పీఎం విశ్వకర్మ యోజన పథకం పొందేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఈ పథకం కింద 18 రకాల చేతివృత్తుల వారికి ఆర్థిక సాయం చేస్తారన్నారు. శిక్షణానంతరం మొదటి విడతలో రుణసౌకర్యం కల్పిస్తారని, లబ్ధిదారులకు రుణంతోపాటు రూ.15 వేలు విలువ చేసే కిట్, స్టైఫండ్ అందజేస్తారన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ, ఈ పథకాన్ని పేదలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, బీజేపీ నాయకులు చిట్టిబాబు, డీఆర్‌డీఏ పీడీ తులసి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్ రెడ్డి, ఎల్‌డీఎం హరీష్ తదితరులు పాల్గొన్నారు.

అపుస్మా జిల్లా అధ్యక్షునిగా మహేష్‌రెడ్డి



జిల్లా అపుస్మా అసోసియేషన్ నూతన కార్యవర్గం

చిత్తూరు కలెక్టరేట్: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) జిల్లా అధ్యక్షుడిగా సీఆర్.మహేష్‌రెడ్డి ఎన్నికయ్యారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఓ పాఠశాలలో ఆ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు. స్థానిక క్యాంఫోర్డ్ పాఠశాలల చైర్మన్ మహేష్‌రెడ్డి (చైర్మన్)గా, ఉపాధ్యక్షులుగా ఎస్ఎస్‌కే రాజా, సెక్రటరీగా కృష్ణ(కుప్పం), ట్రెజరర్‌గా లక్ష్మీప్రసాద్ (పలమనేరు), చీఫ్ మెంటర్‌గా తేజోమూర్తి (చిత్తూరు), చీఫ్ అడ్వైజర్‌గా సురేంద్రరాజు (నగరి), ఉపాధ్యక్షులుగా ప్రభాకర్ రెడ్డి (పుంగనూరు), రమేష్‌బాబు (చిత్తూరు), ధనంజయ (పూతలపట్టు), జాయింట్ సెక్రటరీలుగా రంగనాథ్ (కుప్పం), మోహన్‌రెడ్డి (చిత్తూరు), వెంకటాద్రి (జీడీనెల్లూరు), ఈసీ మెంబర్లుగా జయచంద్రారెడ్డి (జీడీనెల్లూరు), గిరిధరమూర్తి (పలమనేరు)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రైవేట్ స్కూళ్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు తమ వంతు కృషి చేస్తామని నూతన కార్యవర్గం తెలిపింది.

కలెక్టర్‌కు వినతుల వెల్లువ







బిల్లులు మంజూరు చేయాలని కోరుతున్న తవణంపల్లి విజయనగరం యానాది కాలనీవాసులు, సమస్య చెబుతున్న ప్రజలు, ఎల్‌బీపురం గ్రామస్తులు

- ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదుల స్వీకరణ
- పాల్గొన్న కలెక్టర్, జాయింట్

చిత్తూరు కలెక్టరేట్: ప్రజల వినతుల పరిష్కారంలో ఆయా శాఖల అధికారులు అలసత్వం ప్రదర్శించకూడదని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వినతులు వెల్లువలా వచ్చాయి. ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు ప్రజా వినతుల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలన్నారు. అందిన వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి చిత్తశుద్ధితో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల నుంచి అందే ప్రతి అర్జీని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలు రీ ఓపెన్ అయితే అందుకు గల కారణాలను ఖచ్చితంగా వివరించాల్సి ఉంటుందన్నారు.

పోటెత్తిన జనం

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పోటెత్తడంతో గంటల తరబడి బయట నిరీక్షించారు. అధిక సంఖ్యలో ప్రజలు విచ్చేయడంతో గతంలో ఎన్నడూ లేని విధంగా టోకెన్ విధానాన్ని అమలు చేశారు. టోకెన్ నెంబర్ రాసే సిబ్బంది ఎక్కడున్నారని ప్రజలు వెతుక్కోవాల్సిన పరిస్థితి. ఉదయం 9.30 గంటలకు వచ్చిన వారిని 11 గంటలకు కూడా లోనికి పంపని పరిస్థితి ఏర్పడింది. దీంతో దూర ప్రాంతాల నుంచి వృద్ధులు గంటల తరబడి ఎండలో నిలబడలేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటల వరకు అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు 189 , అగ్రికల్చర్ 2, పోలీస్ 1, చిత్తూరు మున్సిపల్ కమిషనర్ 3, డీఆర్‌డీఏ 3, డీఎంహెచ్‌ఓ 1, వి.కోట ఎంపీడీఓ 1, ఎంపీడీఓ పలమనేరు 1, ఎంపీడీఓ కుప్పం 1, ఏపీఎస్‌ఆర్టీసీ 1, ఎంపీడీఓ సదుం 1, పశు సంవర్ధక శాఖ 1, స్కిల్ డెవలప్‌మెంట్ 1, వాటర్ రిసోర్స్ 1, ఎంపీడీఓ చిత్తూరు 1, హౌసింగ్ శాఖ 1 మొత్తం 209 అర్జీలు అందినట్లు కలెక్టరేట్ ఏఓ కులశేఖర్ వెల్లడించారు.

ఇళ్ల నిర్మాణాలకు బిల్లులివ్వడం లేదు

తాము నిర్మించుకుంటున్న ఇళ్ల నిర్మాణాలకు బిల్లులు ఇవ్వడం లేదని తవణంపల్లె మండలం కట్టకిందపల్లె విజయనగరం యానాది కాలనీ గ్రామస్తులు వాపోయారు. ఈ మేరకు వారు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. తమ కాలనీలో 40 కుటుంబాలుకు పక్కా గృహాలు మంజూరు చేయగా 10 గృహాలకు సకాలంలో బిల్లులు ఇవ్వలేదని వెల్లడించారు. పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలన్నారు. తమ పిల్లలకు ఆధార్‌కార్డులు లేక బడులకు వెళ్లడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రేషన్ కార్డులు లేకపోవడంతో బియ్యం పొందలేకపోతున్నామని చెప్పారు. తమ కాలనీకి గత ప్రభుత్వం శ్మశానం కోసం స్థలం ఇవ్వగా దాన్ని వేరొకరు ఆక్రమించుకున్నారని చెప్పారు.

శ్మశాన భూమిలో సౌకర్యాలు కల్పించాలి

గత ప్రభుత్వం తమ గ్రామంలో శ్మశానభూమి కేటాయించిందని ప్రస్తుతం ఆ భూమిలో సౌకర్యాలు కల్పించాలని తవణంపల్లె మండలం కృష్ణాపురం యానాది కాలనీకి చెందిన రాణి, మురళి, సుబ్రహ్మణ్యం కోరారు. ఈమేరకు వారు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ శ్మశానస్థలంలో ప్రహరీగోడతోపాటు బోరు మంజూరు చేయాలన్నారు. శ్మశానస్థలానికి దారి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. దారి సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మొగిలి, ఈశ్వరి, శ్యామల, సుగుణమ్మ పాల్గొన్నారు.

దారిని ఆక్రమించారయ్యా

తమ పొలానికి వెళ్లే దారిని ఆక్రమించారని చిత్తూరు మండలం ఎల్‌బీపురం రైతులు మోహన్, గోవిందరాజులు వాపోయారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ తమ గ్రామంలో సర్వేనెంబర్ 216, 217లో ఉన్న దారిని మరొకరు ఆక్రమించారన్నారు. రాతి కూసాలు నాటి అక్రమంగా దారిని మూసివేశారని ఆరోపించారు. ఈ సమస్యపై మండల రెవెన్యూ అధికారులకు చెప్పినప్పటికీ ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు. యోగపతి, కళావతమ్మ పాల్గొన్నారు.

హైఓల్టేజీతో పేలిన ట్రాన్స్‌ఫార్మర్



చెంగపల్లెలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

- ఇళ్లలో నుంచి బయటకు పరుగులు తీసిన జనం
- 23 ఇళ్లలో కాలిపోయిన టీవీలు, ఫ్రిడ్జ్‌లు, ఇతర వస్తువులు

ఐరాల: మండలంలోని చెంగనపల్లెలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు హైఓల్టేజీ కారణంగా కొన్ని ఇళ్లలో టీవీలు, ఫ్రిజ్‌లు, ల్యాప్‌టాప్‌లు కాలిపోయాయి. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఇళ్లలో నుంచి పెద్దఎత్తున శబ్దాలు రావడంతో గ్రామస్తులు భయంతో బయటకు పరుగెత్తారు. ఆ సమయంలో వైర్లు కాలుతూ టీవీలు, ఫ్రిడ్జ్‌ల నుంచి పొగలు రావడం గమనించారు. దీంతో గ్రామానికి చెందిన మహిళలు, పురుషులు పెద్దసంఖ్యలో రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ ఐరాల ఫీడర్ కింద చెంగనపల్లె రోడ్డు పక్కన ఉన్న సుమారు 70 గృహాలకు ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ ఐదు నెలల ముందు మరమ్మతులకు గురికావడంతో విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేశారు. అయితే ఆదివారం ఉదయం 9 గంటలకు సింగిల్‌ఫేజ్‌లో ఉన్న కరెంట్ 3 ఫేజ్‌లోకి రావడంతో ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోయిందన్నారు. ఆ సమయంలో 23 టీవీలు, 15 ఫ్రిజ్‌లు, 5 ల్యాప్‌టాప్‌లు 5, 1 వాషింగ్‌మిషన్, 1 ఏసీ కాలిపోయాయని వాపోయారు. సుమారు రూ.10 లక్షల మేర నష్టం వాటిలినట్లు తెలిపారు. ఈ విషయంపై లైన్‌మెన్‌కు ఫోన్ చేయగా ఆయన వచ్చి కాలిపోయిన పరికరాలను చూసి వెళ్లారని, ఏఈ చలపతికి ఫోన్ చేస్తే నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసన చేస్తున్న సమయంలో మహిళలు పలుమార్లు ఏఈకి ఫోన్ చేసినా స్పందించలేదన్నారు. సుమారు 2 గంటల పాటు రోడ్డుపై బైఠాయించి ఏఈ డౌన్‌డౌన్ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ నరసింహులు సంఘటనా స్థలానికి చేరుకుని సమస్యను విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద పరిష్కరించుకోవాలని, రోడ్డుపై బైఠాయించి రాకపోకలకు అంతరాయం కలిగించడం సబబు కాదన్నారు. సాయంత్రంలోపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేలా డీఈ, ఏఈతో తానే మాట్లాడానని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు.